క్లుప్తంగా

దరగాలో ఎన్నికల ప్రచారం



దరగాలో ప్రచారం చేస్తున్న కోమలతారెడ్డి, నాయకులు

కంభం: పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మరదలు కోమలతారెడ్డి అన్నారు. మండలంలోని దరగా పంచాయతీలో శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న మంచిని వివరించారు. గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, ఎంపీపీ భర్త చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ బత్తుల వెంకటరంగమ్మ, కృష్ణయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

బేస్తవారిపేట: ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై నరసింహారావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పిటికాయగుళ్ల, నేకునాంబాద్ గ్రామాల్లో బీఎస్ఎఫ్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాతంగా జరిగేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరైనా బెదిరింపులకు గురిచేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్నికల నింబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టండి



చినారికట్ల ఎన్నికల ప్రచారంలో గురవారెడ్డి

కొనకనమిట్ల: రాష్ట్రాన్ని అన్నీ రంగాల్లో అగ్రగామిగా నిలిపిన సంక్షేమ రథసారధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మళ్లీ పట్టం కట్టి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ సమన్వయ కర్త ఉడుముల గురవారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని చినారికట్లలో ఇంటింటా ప్రచారం చేపట్టి ప్రజలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసే విధానంపై అవగాహన కలిపించారు. నియోజకవర్గం అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డిలకు మద్దతు తెలిపి విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి పథంలో నడవాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి ఏలూరి సంజీవరెడ్డి, సర్పంచ్ అనూరాధ వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

గిద్దలూరు రూరల్: ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు మయూర్ కె.మెహతా అన్నారు. పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై ఆయన శుక్రవారం ఆకస్మిక పరిశీలన చేశారు. ఎన్నికల తర్వాత పోలింగ్ బాక్స్‌లను సెయింట్ పాల్స్ స్కూల్ ఆవరణలో భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ప్రతి అధికారి ఎన్నికల నియమావళిని అనుసరించి వ్యవహరించాలన్నారు. పోలింగ్ సమయంలో ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరికీ ప్రతి అధికారి పూర్తిగా సహకరించాలన్నారు. ఓటరును ప్రలోభాలు పెట్టే చర్యలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఆర్వో డి.నాగజ్యోతి, అసిస్టెంట్ ఆర్వోలు సిద్ధార్థ్, వి.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

చీఫ్ ఏజెంట్లను నియమించుకోండి



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో లోకేశ్వరరావు

దర్శి: ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్వో లోకేశ్వరరావు శుక్రవారం సమావేశమయ్యారు. కంటెస్టెడ్ కాండిడేట్స్, ప్రతినిధులు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆదేశించారు. పార్టీ కాండిడేట్‌కు, వారి ఏజెంట్‌కు వెహికల్ పాస్‌లు ఇవ్వడానికి తగు డాక్యుమెంట్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ స్టేషన్స్‌లో పోలింగ్ నిర్వహించాల్సిన ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, సిబ్బందికి భోజనం, మౌలిక సదుపాయాలు కల్పనకు బూత్ లెవల్ అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

జగనన్నను గెలిపించుకుంటేనే భవిష్యత్

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



దిగువమెట్టలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించి.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నకు గెలిపించుకుంటేనే రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్ ఉంటుందని మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని దిగువమెట్ట, తాండ, కృష్ణంశెట్టిపల్లె గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కృష్ణంశెట్టిపల్లెలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో దాదాపు 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఎంపీపీ కడప లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, సర్పంచు అంజినాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ.వెంకటరామిరెడ్డి, రంగస్వామిరెడ్డి, షేక్ అక్బర్, కృష్ణనాయక్, షేక్ మాబుఖాన్, పి.రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.



చెన్నారెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న అన్నా దుర్గాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు

ఫ్యాను గుర్తుకు ఓటేసి అభివృద్ధికి తోడ్పడండి

తర్లుపాడు: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు సతీమణి అన్నా దుర్గాకుమారి, కోడలు అనూషలు స్పష్టం చేశారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో ఎంపీపీ భూలక్ష్మి, జెడ్పీటీసీ ఇందిర, రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు కంది ప్రమీలారెడ్డితో కలిసి వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. ఇప్పటివరకూ అందించిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రెండోసారిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నా రాంబాబుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సొసైటీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయకులకు ఘన స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా గెలుపుకోసం గ్రామ గ్రామాన వైఎస్సార్ సీపీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. యువకులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. తర్లుపాడులో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అన్నా రాంబాబులను గెలిపించాలని కోరారు. మీర్జపేటలో సర్పంచ్ మీరయ్య, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

సూరేపల్లిలో సర్పంచ్ నవ్య రమణయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ జగనన్నను మరోమారు సీఎంగా చేసుకునేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. పోతలపాడులో సర్పంచ్ గాయం శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగి, అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలవాలంటే సీఎం జగనన్నకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. సీతానాగులవరంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ రేగుల సాలమ్మ, నాయకులు దాసయ్య, అంకయ్యలు ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల విజయం కోసం ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. గానుగపెంటలో సర్పంచ్ బాలయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. పాంప్లేట్లు అందించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: రాచర్ల మండలం పుల్లలచెరువు గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు పట్టణంలోని వైఎస్సార్ సీపీ గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి స్వగృహంలో శుక్రవారం కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి బావ శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గురుప్రసాద్, పుల్లలచెరువు నాయకుడు బుజ్జీల ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వేల్పుల రాజయ్య, వేల్పుల గోవిందరాజు, చంద్ర పెద్దిరాజు, చంద్ర రాజయ్య, రాచగొర్ల వెంకటయ్యతో పాటు మరికొంత మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ఘన విజయం సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వేయించేలా పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందు యాదవ్, గోపాల్ యాదవ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. తనను, పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. శుక్రవారం మండలంలోని దరిమడుగులో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు అన్నా రాంబాబు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ జవ్వాజి వెంకటరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్క కుటుంబం అభివృద్ధి చెందిందని, ఇదిలా కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల ప్రకటించిన వైఎస్సార్ సీపీ మానిఫెస్టోతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేంత వరకూ నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు.

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడులో శుక్రవారం టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన జమ్ములమూడి వెంకటేశ్వర్లు, రమేష్, యోబు, సాల్మన్‌ల కుటుంబాల వారికి గ్రామ సర్పంచ్ పార్లపల్లి సిద్దానబీ, మాజీ సర్పంచ్ గర్రె కుసుమకుమారి శ్రీనివాసులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి అహ్వానించారు. పార్టీలో చేరిన జమ్ములమూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అన్నీ సంక్షేమ పథకాలు తమకు వర్తించాయని, పథకాల వలన తాము ఆర్థికంగా నిలబడ్డామన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావటానికి మేమంతా సహకారం అందిస్తామన్నారు. ఉప సర్పంచ్ పోతిపోగు రామయ్య, సచివాలయ కన్వీనర్ బత్తుల బాలపిచ్చయ్య, పి.జాన్ పాల్, మాజీ ఎంపీటీసీ టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

● సబ్ కలెక్టర్ రాహుల్ మీనా



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం: ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సబ్ కలెక్టర్, ఆర్ఓ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో స్థానిక రాజకీయ పార్టీల నేతలు, పోలింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ జరుగుతున్న పరిసరాల్లో వంద మీటర్ల వరకూ నేతలెవరైనా పార్టీల గుర్తులతో ఉండరాదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదని, కేవలం పీఓ, ఏపీఓల దగ్గరే ఫోన్లు ఉండాలని తెలిపారు. పార్టీల నేతలు 100 మీటర్ల అవతల ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, పోలింగ్ కేంద్రాల సమీపంలో ఎవరూ నిర్వహించకూడదని హెచ్చరించారు. పోలింగ్ ప్రారంభమయ్యే ముందుగానే ఏజెంట్లు హాజరు కావాలని, టెంట్లు వేసుకోవాలన్నా పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు అన్నీ పాటించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియనుందని, ఆ తర్వాత ఎవరైనా ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. సమావేశంలో సహాయ ఎన్నికల అధికారి రవికుమార్‌తో పాటు ఎన్నికల అధికారులు, పత్తి రవిచంద్ర, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన అక్కల్‌రెడ్డిపల్లె గ్రామస్తులు

● ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: జగనన్న పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి సాధించారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె, కేఎస్ పల్లె, దిగువమెట్ట గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా ప్రతి గ్రామంలో కేపీ నాగార్జునరెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అండగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రజల ఇంటి వద్దకు పథకాలు చేరవేసిన ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వం అని గుర్తు చేశారు. జగనన్న ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాల గురించి ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికతగా అర్హులందరూ లబ్ధి పొందారన్నారు. పేదల పక్షంగా నిలబడి పరిపాలన కొనసాగిస్తున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. అందరం కలిసి కట్టుగా జగనన్నకు అండగా నిలబడాల్సిన సమయం ఇదేనన్నారు. అక్కల్‌రెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ నుంచి 30 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలోకి నాగార్జునరెడ్డి సమక్షంలో చేరారు. పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పూలి రామకృష్ణారెడ్డి, యర్రం వెంకటరామిరెడ్డి, అంబటి అంకిరెడ్డి, అంబటి బాలిరెడ్డి, ముత్యాలపాటి రంగనాయకులు, కేఎస్ పల్లె సర్పంచి ఎలిజెబెత్తు, పానం సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, దాసరి అబ్రహాం పాల్గొన్నారు.

అన్నా, చెవిరెడ్డిలను గెలిపించండి



గనివానిపాడులో ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

కొనకనమిట్ల: ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు పార్టీ నియోజకవర్గ, ఎంపీ అభ్యర్థులు అన్నా రాంబాబు, చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని పార్టీ యువ నాయకులు బత్తుల నాగార్జునరెడ్డి కోరారు. శుక్రవారం మండంలోని గనివానిపాడులో ఎన్నికల ప్రచారం చేపట్టి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వచ్చాయని గుర్తు చేశారు. అభివృద్ధే లక్ష్యంగా పాలన చేస్తున్న జగనన్నను మరొక్కసారి ఆశీర్వదించాలని ఇంటింటికీ నవరత్నాల మేనిఫెస్టో బుక్‌లెట్ అందజేశారు. ప్రచారంలో సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ని కూటమిలొచ్చినా గెలిచేది జగనే



ప్రచారం చేస్తున్న మైనార్టీ నేత గౌస్ మొహిద్దీన్

మార్కాపురం: కూటమితో ఎంతమంది వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని, మే 13న జరగనున్న ఎన్నికల్లో వార్ వన్‌సైడై వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చేది ఖాయమని ఆ పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్ స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్దపీట వేసి మైనార్టీ రిజర్వేషన్‌ను 4శాతం పెంచిన ఘనత జగనన్నదే అన్నారు. ఆయన మార్కాపురం పట్టణంలో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని, ఇటీవల ప్రకటించిన మానిఫెస్టోతో ప్రజలు మరింత సంతోషంగా ఉంటారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ మరదలు కోమలతారెడ్డి

బేస్తవారిపేట: ఈ నెల 13న జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను కేపీ నాగార్జునరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మరదలు కోమలతారెడ్డి కోరారు. మండలంలోని జేబీకే పురంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. సర్పంచ్ వెంకట లక్ష్మమ్మ, తిరుపతయ్య గౌడ్, మాజీ ఎంపీపీ పి.వెంకటరాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, నాయకులు బి.సుబ్బారెడ్డి, పి.గోపాల్, భూపని శ్రీను, గురుప్రసాద్, తిరుపతయ్య, బాల అంకయ్య, జలపాటి శ్రీను, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆది శంకరాచార్య జయంతి



పూజల్లో మహిళా భక్తులు

మార్కాపురం: శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, ఆచార్య బ్రహ్మాదీ రూత్విగవరణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుంది. ఈ కార్యక్రమాలు శుక్రవారం నుంచి ఈ నెల 12 వరకు జరగనున్నాయి. శుక్రవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ సమారాధన జరిగింది. ఈ సందర్భంగా 11వ తేదీన పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఆలయ చైర్మన్ కేశవరావు, అర్చకులు సోమయాజుల హరి, గోపాలుని హరిహరరావు, బొడిచర్ల అర్జునరావు, ప్రసాద్, ప్రముఖ న్యాయవాది పురాణం సుబ్రహ్మణ్యం, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీనివాసశాస్త్రి, టెంపుల మాజీ చైర్మన్ రెంటచింతల మధుసూదనశర్మ పాల్గొన్నారు.

యువకులు ఓటు వినియోగించుకోవాలి

మార్కాపురం టౌన్: యువ సంకల్ప కార్యక్రమంలో భాగంగా యువకులందరూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. శుక్రవారం యువ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే ముస్లింలు



విలేకరులతో మాట్లాడుతున్న మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ షంషీర్ అలీబేగ్

కంభం: మైనారిటీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ముస్లింలు ఉన్నారని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ షంషీర్ అలీబేగ్ అన్నారు. స్థానిక ఏబీ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాడు వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్‌ల వల్ల ముస్లింల పిల్లలు ఉన్నత చదువులు చదివి వైద్యులుగా, గ్రూప్-1, గ్రూప్ అధికారులుగా రాణిస్తున్నారన్నారు. 2022లో ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తింపునిచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ 5 సీట్లు ముస్లింలకు కేటాయించిందని అందులో నలుగురు ఎమ్మెల్యేలుగా గెలిచారని వారిలో ఒకరికి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారని, నలుగురికి ఎమ్మెల్సీ ఇచ్చి వారిలో ఒక ముస్లిం మహిళకు శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. ఈసారి ముస్లింలకు 7 ఎమ్మెల్యే సీట్లు కేటాయించి ముస్లింలపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. 2014–19వరకు అధికారంలో ఉన్న టీడీపీ ముస్లింలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ఆనాడు టీడీపీ ఒక్క సీటు ముస్లింలకు కేటాయిస్తే అది కూడా ఓడిపోవడం జరిగిందన్నారు. ముస్లిం మైనారిటీలకు, క్రైస్తవులకు ఇది పరీక్షా సమయమని దేశంలో సెక్యులారిటీని కాపాడుకోవాలంటే జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముస్లింల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం రిజర్వేషన్లు కచ్చితంగా కొనసాగిస్తామని చెబుతున్నారన్నారు. బీజేపీతో పొత్తులో ఉన్న టీడీపీకి ముస్లింలకు అండగా ఉంటామని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ముస్లింలు పొరపాటున కూడా కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని హితవు పలికారు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని టీడీపీ చెబుతుందని, కానీ 2019 వరకు అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అర్హతే కొలమానంగా వలంటీర్, సచివాలయాల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఇటువంటి సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి కుటుంబం ఏనాడు అవకాశవాద రాజకీయాలు చేయలేదని, గెలుపైనా ఓటమైనా కార్యకర్తలకు అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తూ వచ్చారన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, ముస్లిం పెద్దలు అమానుల్లాఖాన్, అయూబ్, కరీం, తదితరులు పాల్గొన్నారు.